క్లుప్తంగా

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగుల్‌మీరా

ఇల్లెందురూరల్: చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కొమరారం ఎస్‌ఐ నాగుల్‌మీరా సూచించారు. మండలంలోని పోచారంతండా గ్రామాన్ని సోమవారం రాత్రి కొమరారం పోలీస్ బృందం సందర్శించింది. గ్రామంలోని దుకాణాలను తనిఖీ చేసి గుడుంబా, మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నాగుల్‌మీరా హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాత్కాలిక ఆనందం కోసం సేవించే గుడుంబా, తీసుకునే మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామంలోని విద్యావంతులైన యువత ఆ దిశగా బాధ్యత తీసుకోవాలని కోరారు. క్రమశిక్షణతో మెలుగుతూ నలుగురికి ఆదర్శంగా ఉండాలని, అసాంఘిక కార్యక్రమాల్లో భాగస్వాములై నలుగురిలో అవమానాలు పొందొద్దని సూచించారు. సమావేశంలో కొమరారం పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సక్రమంగా బిల్లులు చెల్లించండి..


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కొత్తగూడెంఅర్బన్: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. పండుగ పూట వంట కార్మికులను పస్తులు ఉంచారని, నాలుగో నెల వంట బిల్లులు, ఐదు నెలల జీతాలు ఇవ్వకుండా స్కూళ్లలో కోడిగుడ్లు పెట్టమని, రాగిజావ పోయమని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. డబ్బులు రానందున కోడిగుడ్లు, రాగిజావ అందించలేమని, మెనూ ప్రకారం పెట్టాలంటే సక్రమంగా బిల్లులు వేస్తేనే అందిస్తామని స్పష్టం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి, మండల కార్యదర్శి స్వప్న, శిరీష, మాడిశెట్టి పద్మ, సరోజ, ఈసం నరసమ్మ, పుణ్యం నాగమణి తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్


విద్యార్థి వేలిముద్రలు నమోదు చేస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్‌కార్డు బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియను ఎంఈఓ ఉమాశంకర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కొమరారం, చల్లసముద్రం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ కేంద్రాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. బయోమెట్రిక్ లేని ఆధార్‌కార్డులు రద్దు అయ్యే అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో విద్యార్థుల కోసం ఈ సౌకర్యం ఏర్పాటు చేశారని వివరించారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు


గోలియాతండాలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టేకులపల్లి: సులానగర్ పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ కందుల దినేశ్ ఆదేశాల మేరకు సోమవారం వైద్య సిబ్బంది మండలంలోని రామచంద్రునిపేట, సింగ్యతండా, గంగారాం, తడకలపూడి, సంపత్‌నగర్, గోలియాతండాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. మలేరియా, డెంగీ, షుగర్, బీపీ టెస్టులు నిర్వహించారు. శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, రుక్సానా, ధరణి, అమూల్య, వీరభద్రమ్మ, లక్ష్మీబాయి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి.. ఎక్కడ?

- రికార్డులకే పరిమితమైన వెయ్యి ఎకరాలు
- అధికారుల ఉదాసీనతతో యథేచ్ఛగా ఆక్రమణలు
- సమీకృత గురుకులం నిర్మాణానికి స్థలం కరువు
- ప్రశ్నార్థకంగా మారిన గోదాముల నిర్మాణం


ఇంటిగ్రేటెడ్ గురుకులాల సముదాయ నిర్మాణం కోసం పరిశీలనలో ఉన్న స్థలం

ఇల్లెందురూరల్: కంచే చేను మేసిందో.. స్వయంగా విక్రయించిందో.. ఆక్రమణదారులు జొరబడినప్పుడు కళ్లు మూసుకుందో.. ఏమో కానీ.. మండలంలో ప్రభుత్వ భూమి సెంటు కూడా కనిపించడం లేదు. సంరక్షించాల్సిన అధికారుల ఉదాసీనత ఆక్రమణదారులకు ఊతమిచ్చిందన్న విమర్శలు లేకపోలేదు. ఫలితంగా ప్రస్తుతం ప్రభుత్వ అవసరాలకు అవసరమైన భూమిని వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. వివరాలిలా ఉన్నాయి.

కనిపించని భూములు

గత ప్రభుత్వం ఆదేశాలతో సమగ్ర భూరికార్డుల శుద్ధీకరణ ద్వారా మండలంలో భూముల వివరాలను అధికారులు సేకరించారు. మొత్తం 98,677.18 ఎకరాల భూమి ఉంది. అందులో పట్టా భూమి 17,523.35 ఎకరాలు కాగా ప్రభుత్వ భూమి 81,153.23 ఎకరాలుగా నమోదైంది. ప్రభుత్వ భూమిలో 61,831.16 ఎకరాలు అటవీభూమిగా నిర్ధారించారు. ఇక మిగిలిన ప్రభుత్వ భూమి 19,322 ఎకరాల్లో ప్రభుత్వ సంబంధిత నిర్మాణాలకు, అసైన్‌మెంట్‌కు కేటాయించినవి, ఆక్రమణలు, వివాదాలకు సంబంధించిన భూములు పోను మొత్తంగా వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమి, 1417.15 ఎకరాలు వ్యవసాయానికి పనికిరాని భూమి, 4075.23 ఎకరాలు వ్యవసాయేతర భ్రష్టు భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో లభ్యమైంది. కానీ, ప్రస్తుతం ఎకరం కూడా అందుబాటులో లేదు.

తప్పని వెతుకులాట

ఇంటిగ్రేటెడ్ గురుకులం నిర్మాణం కోసం 25 ఎకరాలు కేటాయించాల్సి ఉంది. నిర్మాణానికి నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా స్థలం కేటాయింపు వ్యవహారం నేటికీ కొలిక్కి రావడం లేదు. సర్వే నంబర్ 549 పరిధిలో రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలం వివాదాస్పదమైంది. సర్వే నంబర్‌లో స్పష్టత కోసం కోర్టు ఆదేశాలపై సర్వే విభాగం చేపట్టిన సర్వే నెలలు గడుస్తున్నా కొలిక్కిరాలేదు. ఇక ఐటీఐ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా స్థలం కోసం రెవెన్యూ అధికారులు వెతుకుతూనే ఉన్నారు. ప్రస్తుతం సొంత స్థలం ఉన్న పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. రానున్న రోజుల్లో స్థలం లేని వారికి ఇంటి మంజూరుతోపాటు స్థలం కూడా కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గజం ప్రభుత్వ భూమిపై కూడా స్పష్టత లేని అధికారులు వందల సంఖ్యలో పేదలకు స్థలం ఎటా కేటాయిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. స్థలం లేని మండలంలో నూతన గోదాములు, ఏసీ గోదాము నిర్మాణంపై నేతల హామీలు మాటలకే పరిమితమయ్యే పరిస్థితి నెలకొంది.

ఉదాసీనతతో ఆక్రమణలు

మండలంలో ప్రభుత్వ స్థలం వెయ్యి ఎకరాలు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. చిత్తశుద్ధితో పనిచేసిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలను గుర్తించి అందులో బోర్డులు పెట్టి ఆక్రమణదారులపై కేసులు నమోదు చేశారు. కానీ, తదనంతరం రాజకీయ జోక్యం, ఉన్నతాధికారుల ఉదాసీనత ఫలితంగా ఆక్రమణదారుల చేతిలోకే వెళ్లిపోయాయి. సర్వే నంబర్ 608 పరిధిలో ఎకరాల భూములు అన్యాక్రాంతమవుతున్నా ఆక్రమణలో పెద్దలు ఉన్నారన్న భయంతో రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. అటవీ, రెవెన్యూ హద్దులు తేల్చక వేల ఎకరాలు నేటికీ వివాదంలోనే మూలుగుతున్నాయి. గోవింద్‌సెంటర్‌లో 20 ఎకరాల రెవెన్యూ స్థలంలో 12 ఎకరాలు అటవీశాఖకు అప్పగించి విమర్శలు మూటగట్టుకుంది.

విద్యాసంస్థలకు స్థలం కేటాయించాలి



ప్రభుత్వ విద్యాసంస్థల నిర్మాణానికి అనువైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు వెంటనే కేటాయించాలి. ఉన్నత విద్యాసంస్థలు లేని చోట మంజూరైన ఐటీఐ కళాశాలను, సమీకృత గురుకులాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు వెంటనే స్పందించాలి.

–సందిరి రమేశ్, మొండితోగు, ఇల్లెందు మండలం

పేదలకు మేలు చేయాలి



ప్రభుత్వ భూములను గుర్తించి సొంత స్థలం లేని పేదలు సొంతింటి కల నెరవేర్చుకునేలా అధికారులు సహకరించాలి. రెవెన్యూ, అటవీ భూములకు జాయింట్ సర్వే చేయాలి. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించడంలో ఉన్నతాధికారులు చొరవ చూపాలి.

–వాంకుడోత్ విజయ్, 21 పిట్ ఏరియా

అలుగు నిర్మాణం చేపట్టాలని ధర్నా


కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎర్రగుంట చెరువు అలుగు నిర్మాణం వెంటనే చేపట్టాలని, అలుగును ధ్వంసం చేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసు పెట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మొదట ఎర్రగుంట రైతులు ఎర్రగుంట నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీపీఎం జిల్లా నాయకులు దొడ్డా రవికుమార్ మాట్లాడారు. వందేళ్లుగా ఎర్రగుంట ప్రజల వ్యవసాయ అవసరాలకు, పశువుల నీటి అవసరాన్ని తీరుస్తున్న చెరువును కబ్జా చేసి అడ్డం వస్తే రైతులను చంపుతామని బెదిరించడం దుర్మార్గమని, అలాంటి వ్యక్తికి ఇరిగేషన్ అధికారులు వత్తాసు పలకడం తగదని పేర్కొన్నారు. 1995 నుంచి ఉమ్మడి ఏపీలో మూడుసార్లు జన్మభూమి కింద పూడిక తీశారని, 2015లో మిషన్ కాకతీయ మనఊరు – మనచెరువు కార్యక్రమంలో భాగంగా రూ.14.93 లక్షలు మంజూరు కావడంతో కాంట్రాక్టర్‌తో ఒప్పందం కూడా జరిగిందని తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ పంచాయతీలో ఉన్న మంగ చెరువును ఈచెరువుగా చూపిస్తూ మభ్యపెడుతున్నారని విమర్శించారు. తప్పుడు రిపోర్టులు ఇచ్చి కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు వై.సాంబశివరావు, ఎ.సత్యనారాయణ, ఎం.ప్రసాద్, నాగభూషణం, ఎం.వెంకన్న, వి.సత్యవాణి, బి.కాంతి, బి.మాధవి, వి.రాములు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత గల నాయకుడిని కోల్పోయాం


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

జూలూరుపాడు: నిజాయితీ, నిబద్ధత కల్గిన సీపీఐ నాయకుడు వల్లపిన్ని సత్యనారాయణను కోల్పోయామని, ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇటీవల కొత్తూరు గ్రామానికి చెందిన సత్యనారాయణ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సోమవారం సత్యనారాయణ సంతాప సభకు కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా హాజరయ్యారై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, యల్లంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, గార్లపాటి వీరభద్రం, యాసా రోశయ్య, గుడిమెట్ల సీతయ్య, కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మంగీలాల్‌నాయక్, నున్నా కృష్ణయ్య, దుద్దుకూరి సుమంత్, మధుసూదన్‌రావు, నరసింహారావు, హరీష్, రాంబాబు, చందానాయక్, హాతిరామ్, జగన్, హరి, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు ఏఎస్‌ఐగా ఉద్యోగోన్నతి

పాల్వంచరూరల్: రూరల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.హరిబాబుకు ఏఎస్‌ఐగా ఉద్యోగోన్నతి లభించింది. 1989లో కానిస్టేబుల్‌గా తొలుత రూరల్ పోలీస్ స్టేషన్‌లోనే పోస్టింగ్ లభించింది. తర్వాత ఏపీలో ఉన్న కుక్కునూర్ పోలీస్ స్టేషన్‌లో, తిరిగి పాల్వంచ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా సేవలందించాడు. ఏఎస్‌ఐగా ఉద్యోగోన్నతి లభించడంతో తోటి ఉద్యోగులు అభినందించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

జూలూరుపాడు: అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. నాలుగు రోజుల క్రితం కుండపోత వర్షానికి పుల్లుడుతండా పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించింది. పెద్దవాగు పరివాహక ప్రాంతం, లోతట్టు ప్రాంతాల్లో వరద ఉధృతికి పత్తి, మిరప, పత్తి పంటలు కొట్టుకుపోవడంతో భోజ్యాతండా గ్రామ పంచాయతీ పుల్లుడుతండా, వెనకతండా, పాపకొల్లు రైతులు తీవ్రంగా నష్టపోయారు. పెద్దవాగు పరివాహక ప్రాంతం, లోతట్టు ప్రాంతాల్లో కొట్టుకుపోయిన పంటలను అధికారులు పరిశీలించి, రైతుల వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పాపకొల్లు ఏఈఓ విజయభాను, జీపీఓ ఎస్కే చాంద్‌మీరా, భోజ్యాతండా జీపీ సెక్రటరీ రమణి, కాంగ్రెస్ నాయకులు ధరావత్ కాన్షిరామ్, రైతులు ధరావత్ శ్రీను, ధరంసోత్ రాంబాబు, ధరంసోత్ స్వామి, మాళోత్ స్వామి, జాటోత్ బాలు, ధరావత్ నాగు, జాటోత్ సునీత, బానోత్ పద్మ, ధరావత్ జగ్గు, మాళోత్ జయరామ్, లావుడ్యా బాబులాల్, ధరావత్ వెంకట్, బానోత్ సక్రు, జాటోత్ లచ్చు పాల్గొన్నారు.

సంకట స్థితిలో విప్లవ గ్రూపులు

ఇల్లెందు: ఇల్లెందులో ఆరుసార్లు ఎమ్మెల్యే, ఇల్లెందు, బయ్యారం, గుండాల, టేకులపల్లి మండలాల్లో మెజార్టీ ఎంపీపీ, సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకున్న విప్లవ పార్టీ నేడు అతి తక్కువ సీట్లకు పోటీ చేసే పరిస్థితి ఏర్పడింది. 2011 నుంచి ఎన్డీ పార్టీకి చీటలు వారగా.. క్రమంగా సీట్లు కోల్పోతూ నేడు కనీసం కలిసి పోటీ చేసే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో నిన్నటి వరకు ఉన్న సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలైనా మళ్లీ దక్కుతాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఎన్డీ, మాస్‌లైన్ సీట్ల పంపకం విషయంలో రెండుసార్లు చర్చలు జరిపినా సఫలం కాలేదు. ప్రస్తుతం రెండు గ్రూపులు తమకు బలం ఉన్న చోట పోటీ చేయాలని భావిస్తూ అందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

నేడు విధుల బహిష్కరణ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విధులు బహిష్కరించనున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ తెలిపారు. జిల్లా కోర్టులోని లైబ్రరీహాల్‌లో జరిగిన సమావేశంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య అని పేర్కొన్నారు. దాడికి నిరసనగా మంగళవారం కోర్టు విధులను బహిష్కరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షులు జె.గోపికృష్ణ, బాగం మాధవరావు, కాసాని రమేశ్, మాలోతు ప్రసాద్, కె.చిన్నికృష్ణ, ఆడపాల పార్వతి పాల్గొన్నారు.

జడ్జిపై దాడి హేయమైన చర్య

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య అని అందుకు కారణమైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని జైభీమ్‌రావు భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, న్యాయవాది యేర్రా కామేశ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

ఉపాధి కల్పించండి

సింగరేణి(కొత్తగూడెం): 2020–21 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన సమావేశంలో స్థానికులకు హామీల ప్రకారం తమకు ఉపాధి కల్పించాలని మాయబజార్‌వాసులు సోమవారం సొధా కంపెనీ నిర్వాహకులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాయబజార్ వాసులు మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్వహించి పబ్లిక్ హియరింగ్ మీటింగ్‌లో 5 ఇంక్‌లైన్, మాయబజార్ వాసులు, భూనిర్వాసితులకు ఎస్‌పీటీ డైరెక్షన్ ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారని, ఆ హామీని అమలు చేయాలని కోరారు.

అప్‌డేట్ చేయించాలి

జూలూరుపాడు: ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కల్గిన కూలీలు తమ గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా ఈ–కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని జూలూరుపాడు ఎంపీడీఓ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఉపాధి జాబ్‌కార్డుదారులందరూ ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించి, మంగళవారం సాయంత్రంలోగా ఈ–కేవైసీ అప్‌డేట్ చేయించాలని, లేనిపక్షంలో ఉపాధి పనులకు హాజరు కావడం లేదా పనులు పొందడం సాధ్యపడదని పేర్కొన్నారు.

పాలస్తీనాపై దాడులు నిలిపి వేయాలి


ఇల్లెందు: రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఇల్లెందు: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న ఇల్లెందులో సదస్సు నిర్వహిస్తున్నట్లు అఖిల పక్ష రాజకీయ పార్టీల నేతలు తెలిపారు. సమావేశంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ.. ఆయిల్‌పై అమెరికా ఆధిపత్యం కోసం పాలస్తీనా ప్రజలపై సామ్రాజ్యవాద యుద్ధం కొనసాగిస్తోందన్నారు. మానవ హననాన్ని ప్రపంచ శాంతి కోరుకునేవారంతా తీవ్రంగా వ్యతిరేకించాలని, యుద్ధం ఆపేలా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో పలుపార్టీల నాయకులు మధు, ఎస్ఏ నబీ, బాస శ్రీనివాసరావు, యాకుబ్‌షావలి, ముద్రగడ వంశీ, గణేశ్, తుపాకుల నాగేశ్వరరావు, ఆలేటి కిరణ్, ఆంజనేయులు, బి.సత్యనారాయణ, బి.వెంకట్రాం, కె.సారంగపాణి, బి.శ్యామ్, బయ్యా అభిమన్యు, టి.కృష్ణ, తోడేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయండి

టేకులపల్లి: గాజాపై ఇజ్రాయిల్, అమెరికా చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా మంగళవారం ఇల్లెందు పట్టణంలో సంఘీభావ ప్రదర్శనను జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కొడెం రవి, తోటకూరి సతీశ్, సమ్మయ్య, జార్జి, రామ, గవాస్కర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి


జూలూరుపాడు: పనులు పరిశీలిస్తున్న అధికారులు


పాల్వంచరూరల్: పనులను పరిశీలిస్తున్న డీఈ

జూలూరుపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని అభివృద్ధి పనులను సోమవారం జిల్లా విద్యాశాఖ ప్రత్యేక అవసరాల గల పిల్లల జిల్లా కోఆర్డినేటర్ సైదులు, జిల్లా ప్లానింగ్ అధికారి సతీశ్ పరిశీలించారు. జూలూరుపాడు హైస్కూల్‌లో భవిత భవన నిర్మాణం, సూరారం, జూలూరుపాడు ప్రభుత్వ పాఠశాలల్లో సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల కోసం నిర్మిస్తున్న ఫ్రెండ్లీ టాయిలెట్ల నిర్మాణ పనుల పురోగతి, నాణ్యతను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు సైదులు, సతీశ్ మాట్లాడుతూ భవిత భవనం, సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల కోసం నిర్మించే ఫ్రెండ్లీ టాయిలెట్లను నాణ్యతా ప్రమాణాలతో, ఇచ్చిన డిజైన్ ప్రకారమే నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బానోత్ జుంకీలాల్, జూలూరుపాడు కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, పీఎస్ హెచ్ఎం బి.నేతాజీ, రిసోర్స్‌పర్సన్స్ ఆర్ సాంబశివరావు, జె.శ్రీను, ఉపాధ్యాయులు సీతారాములు, మహేశ్ పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచరూరల్: గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, లేనిపక్షంలో నిధులు వెనిక్కి వెళ్లే ప్రమాదం ఉందని పంచాయతీరాజ్‌శాఖ డీఈ రామకృష్ణ అన్నారు. మండలంలోని కారెగట్టులో 2022 –0 2023లో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.20 లక్షల వ్యయంతో భవనం మంజూరు కాగా.. స్థలం లేని కారణంగా పనులు ఆగిపోయాయి. నెల రోజుల క్రితం అధికారులు గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించడంతో నిర్మాణం చేపట్టగా సోమవారం డీఈతోపాటు మండల ఏఈ శ్రీనివాస్ పరిశీలించారు. నిర్మాణంలో జాప్యం జరిగితే నిధులు వెనక్కి వెళ్లిపోతాయని, త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను డీఈ ఆదేశించారు.

కనీస వేతనాలు అమలు చేయాలి..


వినతిపత్రం అందజేస్తున్న ఇఫ్టూ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, మధ్యాహ్న భోజన, హాస్టల్ వర్కర్లు, అంగన్‌వాడీ, హెల్త్, మున్సిపల్, గ్రామ పంచాయతీ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.సీతారామయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్మిక శాఖ అధికారి షరీఫుద్దీన్‌ను కలిసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. 20 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న మధ్యాన్న భోజన కార్మికులు, హాస్టల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమంపై బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయని కాంట్రాక్టర్లు, కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారుల ప్రయోజనాలే ధ్యేయంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం రాష్ట్రంలో, దేశంలో ఉన్న సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన 70 కోట్ల మంది కార్మికుల ప్రయోజనాల కోసం ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఇఫ్టూ రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వర్‌రావు, జిల్లా నాయకులు మల్లికార్జున్‌రావు, మంకెన వెంకటేశ్వర్లు శరత్ ఉన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి..


మాట్లాడుతున్న వెంకటరెడ్డి

జూలూరుపాడు: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ సన్నాహక సమావేశం నిర్వహించగా.. ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లాడి నరసింహారావు, మాళోత్ మంగీలాల్‌నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, వేల్పుల నరసింహారావు, దుద్దుకూరి సుమంత్, రాంశెట్టి రాంబాబు, లకావత్ లచ్చునాయక్, గోపు రామకృష్ణ, కంచర్ల హరీశ్, నర్వనేని పుల్లారావు, ధరావత్ రాంబాబు, కల్యాణపు నరేష్, బానోత్ నవీన్ రాథోడ్, అల్లాడి లింగారావు, చౌడం నరసింహారావు, ధర్మరాజుల వెంకటనారాయణ, ధరావత్ కాన్సిరామ్, హళావత్ రఘు, బానోత్ జగన్, గోసు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అలయ్.. బలయ్


అలయ్ బలయ్ కార్యక్రమంలో నిర్వాహకులు

పాల్వంచ: అన్ని వర్గాలు, మతాల ప్రజలు సోదరభావంతో మెలగాలని నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్‌జేకే అహ్మద్ అన్నారు. సోమవారం స్థానిక వనమా కాలనీలోని అహ్మద్ స్వగృహంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో గ్యార్విషరీఫ్ పురస్కరించుకుని అలయ్ – బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మహ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడవాలని, తమ పొరుగు వారి పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం కళాకారులు పమ్మి రవి, మందపాక విజయ్, షేక్ ఖాసీం, గాంధీ, రోశయ్యచౌదరి పాటలతో అలరించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్‌రెడ్డి, నూకల రంగారావు, బండి లక్ష్మణ్, ఎల్లారావు, సయ్యద్ అక్బర్, నూమాన్, అంజద్, మస్తాన్ ఖురేషి, సాయి, సీతారాములు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.